క్లుప్తంగా

రూ.10 లక్షలతో రహదారి అభివృద్ధి



ఇంద్రపాలెం, గంగనాపల్లి గ్రామాల మధ్య చైతన్యనగర్‌లో రహదారి నిర్మాణ పనులు

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం, గంగనాపల్లి గ్రామాల మధ్య రహదారి సమస్యకు మోక్షం కలిగింది. ఇంద్రపాలెం చైతన్యనగర్ లిటిల్ బడ్స్ స్కూల్ వద్ద రహదారి గొయ్యిలా ఏర్పడి చిన్న పాటి చినుకులకే మునిగిపోయేది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారి అభివృద్ధిపై రెండు పంచాయతీలు నిర్లక్ష్యం వహించాయి. గంగనాపల్లి సర్పంచ్ గీసాల మహాలక్ష్మి ఈ సమస్యను ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వివరించగా, ఆయన సూచనల మేరకు గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలను సర్పంచ్ మహాలక్ష్మి కేటాయించారు. మండల జేఎస్‌సీ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు ఇంజినీరింగ్ అధికారులతో దగ్గరుండి పనులు పూర్తి చేయించడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రెడ్‌క్రాస్‌కు నూతన అంబులెన్స్



రిలయన్స్ ప్రతినిధులు అందజేసిన అంబులెన్స్

కాకినాడ: మృతదేహాలను ఉచితంగా తరలించేందుకు రెడ్‌క్రాస్ సంస్థకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ కొత్త అంబులెన్స్‌ను సమకూర్చింది. ఆత్మబంధు పేరిట రెడ్‌క్రాస్ సంస్థ రెండు దశాబ్దాలుగా అంబులెన్స్ సేవలను కొనసాగిస్తోంది. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ ఉచిత అంబులెన్స్ సేవలు అవసరమైన ప్రజలు ఫోన్ నెంబర్ 77025 10397 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఇంటి నుంచి శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో ఆత్మబంధు సేవలు కొనసాగుతున్నాయన్నారు. కోవిడ్ సమయంలో కూడా ఆత్మబంధు అంబులెన్స్ ద్వారా విస్తృతమైన సేవలు అందించామని చెప్పారు. శీతలపేటిక సేవలను కూడా రెడ్‌క్రాస్ అందజేస్తోందని ఆయన చెప్పారు.

చురుగ్గా సంతకాల సేకరణ




సంతకాల సేకరణ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

బోట్‌క్లబ్: ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గతనెలలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన సమావేశంతో తీసుకున్న తీర్మానాలపై ఆర్యవైశ్యులు చురుగ్గా సంతకాలు సేకరిస్తున్నారు. గ్రామ స్థాయిలో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ అన్నారు. స్థానిక వైఎంవీఏ హాల్‌లో మంగళవారం సంతకాల సేకరణ పుస్తకాలను ఆవిష్కరించారు. యువ పారిశ్రామిక వేత్త కంతేటి కాశీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కంచర్ల బాబీ, ఏపీ ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షులు నాళం అండాళ్ పాల్గొన్నారు.

నేడు పరిమితంగా తాగునీరు

కాకినాడ సిటీ: నగర ప్రజలకు బుధవారం పరిమితంగానే తాగునీరు సరఫరా అవుతుందని నగరపాలక సంస్థ ఎస్‌ఈ సత్యకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల ఒకటో తేదీ నుంచి గోదావరి కాలువలు మూసివేసినందున నగర ప్రజలకు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి తాగునీటిని యథావిధిగా సరఫరా చేసినట్టు ఎస్‌ఈ తెలిపారు. ప్రస్తుతం కాలువలు ఈనెల ఒకటో తేదీన వదలడంతో పైపులైన్ శుభ్రం చేసి తాగునీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. అందువల్ల బుధవారం ఉదయం సరిపడినంత తాగునీరు రాదని ఒకటి నుంచి 13 వార్డులు, 48 నుంచి 50 వార్డులకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. తాగునీరు అత్యవసరమైతే 96767 70461, 98484 71415, 63013 87834 నంబర్లను సంప్రదిస్తే ట్యాంకర్లు పంపుతారని తెలిపారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు సువర్ణరాజు

కాకినాడ రూరల్: వేసవి ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు సువర్ణరాజు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన వృద్ధులకు వైద్యం చేసి పలు సూచనలిచ్చారు. అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పట్టాభిషేకం నేడు

- చొల్లంగిలో పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
- 112 ఎకరాల్లో సకల సౌకర్యాలతో ఐదు వేల మందికి స్థలాల అప్పగింత
- హాజరు కానున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు



జగన్నాథపురం వాసులకు అప్పగించేందుకు సిద్ధమైన చొల్లంగిలోని ఇళ్ల స్థలాలు

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం ప్రాంతవాసుల సొంతింటి కల నెరవేర్చే దిశగా మరో అడుగు పడింది. దాదాపు 112 ఎకరాలను సేకరించి ప్రైవేట్ లేఅవుట్లకు దీటుగా చొల్లంగి గ్రామంలో స్థలాలను సిద్ధం చేశారు. బుధవారం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా పండగ వాతావరణంలో వాటిని లబ్ధిదారులకు అప్పగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

5,200 మందికి స్థలాలు

ఓల్డ్ సిటీగా పేరున్న జగన్నాథపురంలోని 14 నుంచి 27వ డివిజన్ వరకు ఉన్న ప్రజలకు ప్రస్తుతం చొల్లంగిలో 5,200 పట్టాలను ప్రస్తుతం సిద్ధం చేశారు. ఎ న్నికలకు ముందు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 10వేల మంది సొంతింటికల నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. అయితే అనుకున్నదానికి అదనంగా మరో రెండింతలు అంటే 30 వేల మందికి పట్టాలు సిద్ధం చేశారు. దాదాపు 15 వేల మంది లబ్ధిదారులకు కొమరగిరిలో స్థలాలు కేటాయించి, 9 వేల మందికి ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. అయితే జగన్నాథపురం ప్రాంతవాసులకు చొల్లంగి వద్ద స్థలాలు సిద్ధం చేసినా కరోనా, ఇతర సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగి ఇప్పుడు సొంతింటి కల నెరవేరేందుకు మార్గం సుగమమవుతోంది.

నేడు స్థలాల అప్పగింత

ఇళ్ల స్థలాలకు ఎంపికైన దాదాపు 5,200 మంది లబ్ధిదారులకు మూడు రోజులపాటు పండుగ వాతావరణంలో ఇళ్ల స్థలాలను అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. లే అవుట్ ప్రాంగణంలో ఇప్పటికే సరిహద్దు రాళ్లను వేసి స్థలాన్ని చదును చేసిన నగరపాలక సంస్థ అక్కడ రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తోంది. కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల పర్యవేక్షణలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఇతర అధికారులు ఇందుకోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కాగా బుధవారం ఉదయం 7 గంటలకు కాకినాడ నుంచి లబ్ధిదారులను వాహనాల్లో చొల్లంగికి తీసుకువెళ్లి స్థలాలను అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ అవసరమైన సన్నాహాలు పూర్తి చేశారు. ఇళ్ల అప్పగింత ప్రక్రియకు కలెక్టర్ కృతికాశుక్లా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

త్వరలోనే ఇళ్ల నిర్మాణం: ద్వారంపూడి



అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చాం. కరోనా కారణంగా స్థలాల అప్పగింతలో కొంత జాప్యం జరిగినప్పటికీ సకల సదుపాయాలతో ప్రైవేటు లే అవుట్లకు దీటుగా చొల్లంగి స్థలాన్ని అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది. అతి త్వరలోనే ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రారంభిస్తాం. కొన్ని రాజకీయ శక్తులు పేదలకు ఇళ్ళ స్థలాలు దక్కకుండా అవరోధాలు కల్పించినప్పటికీ ముఖ్యమంత్రి సంపూర్ణ సహకారం వల్ల కాకినాడ వాసుల కోసం 650 ఎకరాల భూసేకరణ చేసి స్థలాలను కూడా అభివృద్ధి చేయగలిగాం.

చలివేంద్రాలలో మజ్జిగ పంపిణీ



గంగరాజునగర్ వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

కాకినాడ రూరల్: వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మండల పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేసి చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. బోట్‌క్లబ్ వద్ద సద్గురువు ఉమర్ ఆలీషా ఆధ్వర్యంలోని చలివేంద్రం ద్వారా మజ్జిగ, చల్లని నీటిని పంపిణీ చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ ఎదురుగా సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయరెడ్డి చలివేంద్రం కొనసాగిస్తున్నారు. వలసపాకల గంగరాజునగర్ జంక్షన్ వద్ద కాకతీయ సేవాసమితి ద్వారా చలివేంద్రం నిర్వహిస్తుండగా మంగళవారం విశ్రాంత డివిజన్ పౌర సంబంధాల అధికారి నేమాని విజయ్‌కుమార్ తన తల్లిదండ్రులు సర్వారాయుడు, వరలక్ష్మి పేరిట మజ్జిగ పంపిణీ చేశారు.

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరప: కరపలో ఏర్పాటుచేసిన జగనన్న సెంట్రల్ లే అవుట్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం విద్యుత్, రెవెన్యూశాఖాధికారులు స్థలాన్ని పరిశీలించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 130 ఎకరాలు సేకరించి, సెంట్రల్ లే అవుట్ వేశారు. ఇందులో మండల పరిధిలోని అన్ని గ్రామాలవారికి సుమారుగా 5,350 మందికి పట్టాలిచ్చారు. జగనన్న కాలనీలో విద్యుత్ లో–ఓల్టేజీ సమస్య లేకుండా ఉండేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేసి, లే అవుట్‌లోని ఖాళీ స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించాలని సూచించారు. దీంతో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కరప సబ్‌స్టేషన్ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ లే అవుట్‌కు ముందుభాగంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించి ఖాయం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కాకినాడ సిటీ: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం కాకినాడలోని జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పని చేసే మూడు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- చొల్లంగి లేఅవుట్ సందర్శన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అర్హులైన ప్రతి లబ్ధిదారుడి సొంతింటి కల సాకారంచేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. జగన్నాథపురం వాసులకు పంపిణీ చేయనున్న చొల్లంగి లేఅవుట్ స్థలాలను ఆయన మంగళవారం సందర్శిం లెవెలింగ్, ఇతర పనులను పర్యవేక్షించారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఐదు వేల మందికి ఇళ్ల స్థలాలను అప్పగిస్తామన్నారు. ఉదయం, సాయంత్రం వెయ్యి మంది చొప్పున వీటిని అందజేస్తామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు దుమ్ములపేట సమీపంలో స్థలాలను సిద్ధం చేయగా, టీడీపీ నేతలు అడ్డుకుని న్యాయస్థానం ద్వారా స్టే తెచ్చారన్నారు. అయినప్పటికీ సీఎం పట్టుదలతో వేరొక ప్రాంతంలో స్థలాలను సేకరించి లబ్ధిదారులకు ఇచ్చేందుకు ముందుకు రావడంతో టీడీపీ నేతల అవరోధాలకు అడ్డుకట్ట వేశామన్నారు. భగవంతుని ఆశీర్వాదం, సీఎం జగన్ సహకారం వల్లే కాకినాడలో 30 వేల మందికి ఇళ్ళ స్థలాలను పంపిణీ చేయగలుగుతున్నామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు జొన్నాడ చినబాబు, మల్లిపాముల గణపతి తదితరులు ఉన్నారు.

కమిషనర్ పరిశీలన

చొల్లంగి, పటవల లే అవుట్లను నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల మంగళవారం సందర్శించారు. పేదల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాలకు హద్దుల ఏర్పాటు, చదును చేసే ప్రక్రియలను పరిశీలించారు. బుధవారం, గురువారం చొల్లంగిలో ప్రజలకు ఇళ్ల స్థలాల అప్పగింత ప్రక్రియపై అధికారులతో చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీబీ నాగశాస్త్రులు, టీపీఆర్‌ఓ కృష్ణమోహన్ పలువురు సచివాలయ సిబ్బంది అధికారులు ఉన్నారు.

ముగిసిన ధనమ్మ జాతర



ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం కోటి స్తంభాలపేటలోని ధనమ్మతల్లి జాతర మహోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. వారం రోజుల పాటు జరిగిన జాతరకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి బడే గోవిందరావు మాట్లాడుతూ జాతర ప్రారంభమైన దగ్గర నుంచి పెద్ద జాగారం వరకూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని, అవి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నట్లు చెప్పారు. కాకినాడ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందించారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు ఎస్.అప్పలనర్సమ్మ, గంపల బాల, సీహెచ్ శ్రీనివాసరావు, సీహెచ్ తాతాజీ, కె.సంపత్ నాగేశ్వరావు, జి సోమరాజు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



ఫిర్యాదుదారు సమక్షంలో పొలంలో సర్వే చేయిస్తున్న అధికారులు

కరప: కలెక్టరేట్ స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్ తదితరులు విచారణ నిర్వహించారు. మండలం వేళంగి గ్రామానికి చెందిన ప్రత్తిపాటి రుక్మిణమ్మకు చినమామిడాడ సమీపంలో సర్వేనంబరు 18/5లో 83 సెంట్ల పంటపొలం ఉంది. ఈ పొలానికి సరిహద్దులో పుంతమార్గం పక్కన చంద్రు రామకృష్ణప్రసాద్‌కు అదే సర్వే నంబరుతో 17 సెంట్ల భూమి ఉంది. అయితే రుక్మిణమ్మ తన పొలానికి పుంత మార్గానికి మధ్య భూమిని 1950 నుంచి ఆక్రమించుకున్నారని, తన పొలానికెళ్లే దారి లేకుండా పోయిందని, న్యాయంచేయాలని కోరుతూ కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా స్పందించి ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు, కరప పోలీసుస్టేషన్‌కు పంపించారు. దీంతో మంగళవారం అధికారులు రుక్మిణమ్మ, సరిహద్దుదారులైన రామకృష్ణప్రసాద్‌ను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపారు. సర్వేనంబరు 18/5లోని పొలాన్ని సర్వే చేశామని, రెవెన్యూ రికార్డుల ప్రకారం రుక్మిణమ్మ పేరన 83 సెంట్ల భూమి, రామకృష్ణప్రసాద్‌పేరన 17 సెంట్లభూమి ఉందని, రీసర్వేలో కూడా రికార్డుల ప్రకారం సరిపోయిందని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. అయినా రుక్మిణమ్మ అంగీకరించకపోవడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఇ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచర్రావు, డీటీ సురేష్, ఏఎస్ఐ ప్రసన్నకుమార్ ఇరువురుని పొలంలోకి తీసుకెళ్లి వారి ఎదుటే సర్వేచేసి ఆమెకు సరిహద్దులోని భూమి ఆక్రమణ జరగలేదని, రామకృష్ణప్రసాద్ పూర్వీకుల పేరనే 1956 నుంచి 17 సెంట్లు ఉందని వివరించారు. దీనికి రుక్మిణమ్మ అంగీకరించక కోర్టులోనే తేల్చుకుంటానని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

అంగన్‌వాడీ పోస్టులకు 9 లోగా దరఖాస్తు చేసుకోవాలి

కరప: తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కరప మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు, అర్హులైనవారు ఈనెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పెదకొత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ జనరల్), కరప–7లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–బి), కూరాడ–1లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–ఏ), కరప–8లో అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–డీ), రిజర్వ్ చేయబడ్డాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకుని అర్హులైనవారు దరఖాస్తు చేయాలని, సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికచేయడం జరుగుతుందని సీడీపీఓ తెలిపారు. తాళ్లరేవులోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుని, పూర్తి చేసిన దరఖాస్తులు అదే కార్యాలయంలో ఈ నెల 9వ తేదీలోగా అందజేయాలని గ్రేడ్–1 విస్తరణాధికారి పి.కనకరత్నం తెలిపారు. మిగిలిన వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి



జగనన్నకి చెబుదాం స్పందనపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీసర్వే త్వరగా పూర్తిచేయాలని ఆర్డీఓ బీవీ రమణ ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్‌లతో మంగళవారం ఆయన సమావేశమై కాకినాడ రెవెన్యూ డివిజన్‌లోని 122 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో భూముల సరిహద్దులకు సంబంధించి మక్కురాళ్లను త్వరగా పాతాలన్నారు.

నిర్ణీత గడువులో దరఖాస్తులు పరిశీలించండి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి మండల, డివిజన్ స్థాయిల్లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీఓ రమణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో జగనన్నకు చెబుదాంపై సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ తరచూ వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టి శాశ్వత పరిష్కారం చూపాలని, కోర్టు సివిల్ తగాదాల్లో దరఖాస్తుదారుడికి తగిన సమాచారం అందించాలని సూచించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పాటంశెట్టి నారాయణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

122 గ్రామాలలో రీసర్వే పూర్తి

కాకినాడ రూరల్: కాకినాడ డివిజన్ పరిధిలో 122 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష సర్వే పూర్తవ్వడంతో భూములకు ముక్కు రాళ్లను పాతించినట్టు ఆర్డీఓ బీవీ రమణ తెలిపారు. మండలంలోని గంగనాపల్లి గ్రామంలో రీసర్వే తరువాత రాళ్ల పాతిన భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మురార్జీ కాకినాడ రూరల్‌లో రీ సర్వే ప్రగతిని వివరించారు. వీఆర్వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు ఇప్పించండి



ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగ యువతీ యువకులు

కాకినాడ రూరల్: జిల్లా పరిషత్‌లో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు విద్యార్హత సరిపోలేదని ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇవ్వలేనందున తక్షణమే కారుణ్య నియామకాలు ఇప్పించాలని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా పరిషత్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన వారి కుటుంబ సభ్యులు రాజీవ్‌నాయకర్, దుర్గ, దీపిక, నోయల్ జాన్సన్ తదితరులు వినతి పత్రం అందజేయడంతో న్యాయం జరిగేలా చూస్తానని కన్నబాబు హామీ ఇచ్చారు.

క్రికెట్ టోర్నీలో 5 మ్యాచ్‌లు



వేళంగి హైస్కూలులో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేసిన ఉపాధ్యాయుడు వీరేంద్ర

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మూడో రౌండుకు చేరుకున్నాయి. అండర్–19 విభాగంలో మంగళవారం 5 మ్యాచ్‌లు జరిగాయి. మొదటిమ్యాచ్‌లో కరప జట్టుపై వేములవాడ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బన్నీ (వేములవాడ) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో కూరాడ జట్టుపై పెద్దాపురప్పాడు జట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వెంకట్ (పెద్దాపురప్పాడు) నిలిచాడు. మూడో మ్యాచ్‌లో వలసపాకల జట్టుపై వేళంగికాలనీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బి.సాయి (వేళంగి) నిలిచాడు. నాలుగో మ్యాచ్‌లో సిరిపురం టీమ్‌పై కూరాడ ఫ్రెండ్స్ టీమ్ విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రాజ్(కూరాడ) నిలిచాడు. ఐదో మ్యాచ్‌లో జగన్నాథగిరి జట్టుపై వాకాడ జట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఆకాష్ (వాకాడ) నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను విజేతలకు ఉపాధ్యాయుడు దూళ్ల వీరేంద్ర అందజేశారు.

బదిలీల వేళ నియామకాలేల

- డీఎంహెచ్‌ఓ, ఏఓలను కలసిన ఏపీ ఎన్‌జీఓ నేతలు
- వివాదాస్పదమవుతున్న పాత ప్రకటనపై భర్తీలు



అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్న ఏపీ ఎన్‌జీవో నాయకులు

కాకినాడ క్రైం: బదిలీలు జరుగుతున్న సమయంలో స్థానిక ఖాళీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాత నియామక ప్రకటన ద్వారా భర్తీ చేయడం వివాదాస్పదమవుతోంది. ఈ చర్యపై ఏపీఎన్‌జీవో ముఖ్య నేతలు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రోణంకి రమేష్, ఇన్‌చార్జి ఏవో సూర్యచంద్రను కలిసి మంగళవారం సాయంత్రం తమ అభ్యంతరం తెలిపారు. ఏళ్ల తరబడి లూప్‌లైన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న ఎందరో ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై నిషేధం ఎత్తివేసిందని ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు తెలిపారు. గత నోటిఫికేషన్‌లను ఈ సమయంలో తెరమీదికి తెచ్చి ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టుల భర్తీ ప్రారంభించడం సబబు కాదన్నారు. డీఎంహెచ్‌వో అధికారుల ఏకపక్ష నిర్ణయం వల్ల ప్రభుత్వం ఉద్యోగులకు అందిస్తున్న ప్రయోజనాలను అందిపుచ్చుకోలేని దుస్థితి ఎదురైందని అన్నారు. నూతన బదిలీలతో నిర్ణీత ఖాళీలు భర్తీ చేస్తే ఎదురు చూస్తున్న ఉద్యోగులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బదిలీల ప్రక్రియ ముగిసే వరకు నియామక ప్రక్రియ పునః ప్రారంభించడాన్ని నిలిపివేయాలని కోరారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను కలిసిన వారిలో ఏపీఎన్‌జీవో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు, జిల్లా కోశాధికారి పద్మ మీనాక్షి ఉన్నారు.

ముంపు నివారణకు పంప్‌హౌస్

కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



పంపుహౌస్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: వర్షాలు, వరదల ప్రభావంతో ఏర్పడే ముంపు సమస్యను నియంత్రించేందుకు వార్పు రోడ్డులోని పాత బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద పంప్‌హౌస్ నిర్మిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన పంపుహౌస్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఎస్‌ఈ పి.సత్యకుమార్ పనుల ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షం, వరద నీటిని నియంత్రించి ఉప్పు టేరు ద్వారా ముంపు నీటిని బయటకు తరలించేందుకు ఈ పంప్‌హౌస్ ఉపయోగపడుతుందన్నారు. పనులను వేగవంతంగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

సర్పంచ్‌ల హక్కుల కోసం పోరాటం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సర్పంచ్‌ల హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని, రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి రావాలని ఏపీ సర్పంచ్‌ల సంఘం పిలుపునిచ్చింది. కాకినాడలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సదస్సు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌ల సమర శంఖారావం పేరుతో జెడ్పీలు, కలెక్టరేట్‌లు వద్ద భారీ ధర్నాలను చేయాలని, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించాలని సర్పంచ్‌లను కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా సంఘాన్ని ఎన్నుకున్నారు. సర్పంచ్‌ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జెడ్పీటీసీల శిక్షణ



జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న రెండో బ్యాచ్ రెండవ రోజు శిక్షణ కొనసాగుతుంది. రెండవ రోజు జెడ్పీలో మౌలిక సదుపాయాలు, విద్య, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, మహిళా శిశు సంక్షేమం, వైద్యం, ఆరోగ్యం, జల్ జీవన్ మిషన్, నిదులు, ఆదాయాలు, ఖర్చులు వంటి అంశాలపై ఈటీసీ ఫ్యాకల్టీ ఆంజనేయులు, డీపీఓ విక్టర్, వ్యవసాయశాఖ జెడీ విజయకుమార్, పశుసంవర్ధక శాఖ జెడీ సూర్యప్రకాష్ గౌస్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్, ఫ్యాకల్టీ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి శెట్టిబలిజపేటకు చెందిన పోలవరం వెంకటరమణ (55) మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇంట్లో ఇన్వెర్టర్ నుంచి శబ్దం రావడంతో పరిశీలించడానికి వెళ్లి వైరు పట్టుకున్నాడు. దీంతో వెంకటరమణ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగార్జున మంగళవారం రాత్రి తెలియజేశారు.